క్లుప్తంగా

తాగునీటి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ ప్రసన్నలక్ష్మి

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో ఉన్న దళితవాడలో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును శుక్రవారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడిన ఈ కాలనీ ప్రజలు ఇప్పుడు బోరు అందుబాటులోకి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొయిద ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులతో విద్యార్థులు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులను తాడేపల్లికి చెందిన కమ్మ రామకృష్ణ శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, పీడీ ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఆర్‌జేడీ ఆరా



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగరాజు

రాజాం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, ఏఈ వెంకట్‌లతో ఆర్‌జేడీ నాగరాజు శుక్రవారం సమావేశమై, పట్టణంలో వార్డుల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పార్కుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, కొత్తగా మురుగుకాలువలు నిర్మించడం, తాగునీటి సమస్య లేకుండా చేయడం వంటి వాటిపై దృష్టిసారించాలన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



సూడోమోనాస్ ప్యాకెట్లతో రైతులు

బొబ్బిలి రూరల్: పంటలు వేసే ముందు విత్తనాలు తప్పనిసరిగా శుద్ధి చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శంకరరావు, వీఏఏ సుస్మిత తెలిపారు. మండలంలోని జగన్నాథపురం రైతు భరోసా కేంద్రంలో సూడోమోనాస్ అనే శుద్ధి రసాయనాన్ని రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. విత్తనాలను ఈ రసాయనంతో శుద్ధి చేసుకోవడం ద్వారా పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. ప్రతీ రైతు ఈ సూచనలు పాటించాలని కోరారు.

ముమ్మరంగా అవుట్‌డోర్ శానిటేషన్



బావిలో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్న దృశ్యం

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అవుట్‌డోర్ శానిటేషన్ కార్యక్రమాలు ముమ్మరం చేశామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. మారుతీనగర్, డోలపేట, మెంతిపేటకాలనీ, వాసవీనగర్, గాంధీనగర్ వార్డుల్లోని కాలువల్లోని మురుగు తొలగించడం, బ్లీచింగ్ చల్లడం, తాగునీటి బోర్లు, బావుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.



బొబ్బిలి: పాతబొబ్బిలి నుంచి మక్కువ వెళ్లే దారిలో రోడ్డుపై కూలిన భారీవృక్షం



మెంటాడ: రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

గాలివాన బీభత్సం

గాలివాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఒక్కసారిగా మేఘావృతమై, వాతావరణం చల్లబడింది. అనంతరం భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు, భారీవృక్షాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు, స్తంభాల కారణంగా ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, మరికొన్నిచోట్ల విద్యుత్ వైర్లపై విరిగిపడిన చెట్లకొమ్మలతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.



బొబ్బిలి: రామందొరవలస, ఐటీఐ కాలనీలో నేల కూలిన విద్యుత్ స్తంభాలు



మెంటాడ: ఇద్దనవలస నుంచి ఆంధ్ర వెళ్లే దారిలో విరిగిపడిన విద్యుత్‌స్తంభం



బొబ్బిలి: కూరాకుల వీధిలో ఇళ్ల విద్యుత్ సర్వీస్ వైర్లపై పడిన చెట్టు



బొబ్బిలి: తారకరామా కాలనీలో విద్యుత్ వైర్లపై పడిన చెట్టుకొమ్మ



రాజాం: పాగిరి పొలాల్లో కురుస్తున్న వర్షం



సంతకవిటి: పొలాల్లో చేరిన వర్షపు నీరు



సంతకవిటిలో కూలిన షాపు దగ్గరి తాటాకుల షెడ్డు

స్టూడెంట్ కిట్లు అందజేత

రేగిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు శుక్రవారం అందజేశారు. ఎంఈవోలు ప్రసాదరావు, ఎరకయ్యలు మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికే ఈ కిట్లు విద్యార్థులకు అందేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇప్పుడు ప్రతీ పాఠశాలలో పక్కాగా ఈ కిట్లు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.మధుసూదనరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులతో పాటు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు హాజరుకావాలని ఆయన కోరారు.

సంతాపం

సంతకవిటి: మండలంలోని సిరిపురం మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ మంగరాజు కామినాయుడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావులు కామినాయుడు మృతి పట్ల సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం రేపు

బాడంగి: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత నేత్రవైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరానికి వచ్చి, కంటి రోగులను పరీక్షించి, అవసరమైన మందులు, సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులతో పాటు బ్యాంకు ఖాతా నంబర్, ఫోన్ నంబర్ వెంట తీసుకురావాలన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



ఏపీపురంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ

రేగిడి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీపీ దార అప్పలనరసమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ అన్నారు. మండలంలోని ఏపీపురం, ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. చిన్నవయసులోనే బాలికలకు వివాహాలు చేయడం ద్వారా వారికి విద్య దూరమవుతుందని, గృహ హింసకు గురవుతారని, 30 ఏళ్లకే ముసలితనం, మాతాశిశు మరణాలు, పౌష్టికాహార లోపంతో పిల్లలు పుట్టడం, పుట్టిన పిల్లల్లో పౌష్టికాహార లోపం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్న విషయాలు గుర్తుంచుకోవాలన్నారు. పురుషులకు 21 ఏళ్లు, స్త్రీలకు 18 ఏళ్ల వయసు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చుక్క వెంకటనాయుడు, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



అంబకండిలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

రేగిడి: మండలంలోని అంబకండి, సోమరాజుపేట, ఉంగరాడ తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం శుక్రవారం చేపట్టారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యులు వీధుల్లో తిరుగాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మల గురించి వివరించారు. ధర్మస్థాపనకు చేయాల్సిన కార్యాలను తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు పుండరీకాక్షయ్య, వెంకటరావు, గోపాలకష్ణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త వహించండి



వృద్ధురాలి ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు సూచించారు. రేగిడి గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు ఆయన ఆరోగ్య తనిఖీలు చేసి, మెరుగైన ఆరోగ్యానికి సలహాలు, సూచనలు ఇచ్చారు. రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. వీలైనంతవరకు కాచివడపోసిన నీటిని తాగాలని, వేడివేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలు తినాలన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడితే వెంటనే ఆశ కార్యకర్తను గానీ, ఏఎన్ఎంను గానీ సంప్రదించి, మందులు తీసుకోవాలన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన



శిథిలమైన కల్వర్టును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శుక్రవారం పర్యటించారు. అక్కడి పారిశుద్ధ్యం, మురుగుకాలువల పరిస్థితిని పరిశీలించారు. వర్షాకాలంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

ముసుగులు తొలగించండి



వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న రియాజ్‌ఖాన్, షేక్ సర్దార్

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక పట్టణంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించాలని మున్సిపల్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు రియాజ్‌ఖాన్, షేక్ సర్దార్‌లు కోరారు. బలిజిపేట రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగును ఎన్నికల కోడ్ ముగిసినా తొలగించలేదన్నారు. అధికారులు స్పందించి, ఎక్కడైనా నాయకుల విగ్రహాలు ముసుగులు తొలగించలేదో వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారుల మస్తర్లు పరిశీలించి, పలు సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. ఉరుములు, పిడుగుల సమయంలో సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తెలిపారు.

పిల్లల మానసిక ఎదుగుదల ముఖ్యం



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ

రేగిడి: మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ, వైద్యారోగ్య సిబ్బందికి పిల్లల పెంపకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ మాట్లాడుతూ పిల్లల శారీరక ఎదుగుదలతో పాటు మానసిక ఎదుగుదల కూడా ముఖ్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. ముఖ్యంగా పిల్లల సర్వతోముఖాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



సంకిలిలో ఇంటి ముందు డ్రమ్ములో నిల్వ చేసిన నీటిని పారబోస్తున్న సిబ్బంది

రేగిడి: మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మండలంలోని సంకిలి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఎటువంటి రోగాలు దరిచేరవన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. నీరు ఎక్కువగా ఎక్కడైతే నిల్వ ఉంటుందో అక్కడ దోమలు పెరిగి మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అప్పారావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం బాగు



భీమవరంలో నవధాన్యాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బాడంగి: నవధాన్యాల సాగుతో భూసారం బాగుంటుందని, తద్వారా పంటలు బాగా పండుతాయని ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ రమేష్ అన్నారు. మండలంలోని భీమవరం, వాడాడ, గొల్లాది గ్రామాల రైతు భరోసా కేంద్రాల వద్ద నవధాన్యాల విత్తనాల తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలను పొలంలో వేసి, మొక్కలైన తర్వాత వాటిని అదే నేలలో కలియదున్నితే నేల సారవంతమవుతుందని తెలిపారు. ఈ విధంగా తయారైన నేలలో వేసుకునే పంటలకు అవసరమైన పోషకాలు నేల నుంచే లభిస్తాయన్నారు. తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమై పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సన్యాసిరావు, ఈశ్వరరావు, ఏవో శిరీష, ఐసీఆర్‌పీలు గౌరమ్మ, భవాని, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు సరఫరాకు చర్యలు



పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు తరలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: మండలంలోని అన్ని పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు సరఫరాకు చర్యలు చేపడుతున్నామని ఎంఈవో జె.త్రినాధరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్ నుంచి గత కొన్నిరోజులుగా పాఠశాలలకు వాహనాల ద్వారా కిట్ల పంపిణీకి చర్యలు చేపడుతున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లను సీఆర్‌పీల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు.

పాఠశాలలకు చేరుకున్న స్టూడెంట్ కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులంతా విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన శిశువు జననం



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

రామభద్రపురం: తల్లి గర్భం దాల్చిన నాటి నుంచే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని, అలా అయితే ఆరోగ్యవంతమైన శిశువు పుడతారని ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆమె.. సంపూర్ణ పోషణ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా అందించాలని తెలిపారు. చిరుధాన్యాల వినియోగాన్ని పెంచడంతో పాటు పిల్లల ఎత్తు, బరువులు చూసి అవి వయసు తగ్గ ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోర్టిఫైడ్ బియ్యంతో రక్తహీనత అధిగమించి, హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, రత్నకుమారి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.